ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 07 | జూలై | 2024
పేజీలు 8

# గంజాయి తరలిస్తున్న యువకుల అరెస్టు




**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** ఒడిశా రాష్ట్రం నుంచి మోటార్ సైకిళ్లపై హైదరాబాద్‌కు తరలిస్తున్న ఐదుగురు యువకులను ఖమ్మం రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సూర్యాపేట హైవే పక్కన గల కోతుల గుట్ట సమీపంలో అనుమానంతో ద్విచక్ర వాహనాలను తనిఖీ చేయగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఖమ్మంకు చెందిన దొంతుల సాయి రాఘవేంద్ర, హైదరాబాద్‌కు చెందిన శరత్‌చంద్ర, అలేటి శివ, గొంగిడి నిషాంత్, కృపాకర్ లను అదుపులోకి తీసుకున్నారు. 7.113 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ రాజిరెడ్డి తెలిపారు. దీని విలువ రూ.1,75,000 ఉంటుందని అంచనా వేశారు. ఎస్ఐ కుషకుమార్, ఏఎస్ఐ బి. దీప్లా, కె. తిరుపతి రావు, సిబ్బంది జివి దాస్, జి. సుధాకర్, రాజేష్, కృష్ణ లు ఈ గంజాయి ముఠాను అరెస్టు చేసిన వారిలో ఉన్నారు. గంజాయి రవాణాలో యువకులను చాకచాక్యంగా అరెస్టు చేయడంతో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్న సిబ్బందిని సిపి సునీల్ దత్, ఏసిపి తిరుపతిరెడ్డి లు అభినందించారు.

## 20 స్థానాలు పెరిగితే
# దేశ రాజకీయ ముఖచిత్రం మారేది




**-కార్పొరేట్ కార్యాలయంలా పార్లమెంటు భవనం**
**-ఖమ్మంజిల్లా అభివృద్ధి పైనే ప్రధాన దృష్టి**
**-సిపిఐ అభినందన సభలో ఖమ్మం ఎంపి రఘురాం రెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** 20 పార్లమెంటు స్థానాలు విపక్షాలకు పెరిగితే దేశ రాజకీయ ముఖ చిత్రంలో స్పష్టమైన మార్పు వచ్చేదని బిజెపి పాలన నుంచి దేశానికి విముక్తి లభించేదని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి తెలిపారు. పార్లమెంటులో మెజార్టీ తగ్గినా బిజెపిలో మార్పు లేదని ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. పార్లమెంటు సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఖమ్మంకు వచ్చిన రఘురాంరెడ్డి శనివారం ఖమ్మం సిపిఐ కార్యాలయంకు వెళ్లారు. సిపిఐ శ్రేణులు ఎంపికి ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా

మిగతా 2లో..

## గంజాయితో
# చిత్తవుతున్న భవిష్యత్తు..!

**రవాణాలో విద్యార్థులు**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** డబ్బు ఆశతో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే భవిష్యత్తు చిత్తవుతుందన్న వాస్తవాన్ని యువత గ్రహించకపోవడం శోచనీయం. చేతి ఖర్చుల కోసమో లేదా ఇతరత్రా అవసరాల కోసమో గంజాయి రవాణా చేసేందుకు అంగీకరించి జైళ్ల పాలవుతున్నారు. ఇందులో ఎక్కువగా విద్యార్థులు ఉండడం శోచనీయం. శనివారం ఖమ్మం రూరల్ పోలీసులకు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఐదుగురు విద్యార్థులు కావడం ఉన్నత చదువులు చదువుతుండడం గమనార్హం. గంజాయి వ్యాపారుల దగ్గర నుంచి హైదరాబాద్‌కు రవాణా చేసేందుకు డబ్బులు తీసుకుని మార్గ మధ్యలో దొరికి పోయారు. దొంతుల సాయి రాఘవేంద్ర అగ్రికల్చర్ బియస్సి మూడవ సంవత్సరం చదువుతున్నాడు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి వెనక లైనులోఉండే ఈ విద్యార్థి భవిష్యత్తు గంజాయి కేసుతో దెబ్బతిన్నది. హైదరాబాద్‌కు చెందిన

మిగతా 2లో..

# ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు..!



**- మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు**
**- గ్రామాల్లో వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు**
**- ప్రైవేటు ఆస్పత్రుల్లో పెరుగుతున్న కేసులు**
**- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వర్షా కాలం ప్రారంభం కావడంతో జిల్లాలో సీజనల్ వ్యాధులు మొదలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏజెన్సి విస్తరించుకుని ఉండటంతో అనేక మారుమూల గిరిజన గ్రామాలున్నాయి. మలేరియా, డెంగ్యూతో పాటు వైరల్ ఫివర్స్ రావడంతో ప్రజలు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో నిండిపోతున్నాయి. అటవీ గ్రామాలతో పాటు పట్టణాల్లో సైతం దోమల బెడత పెరగడంతో పరిస్థితులు సీజనల్ వ్యాధులవైపు దారితీస్తున్నాయి. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను ప్రమత్తం చేసేందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో పాటు ఐటిడిఏ పిఓ బి.రాహూల్, పోలీస్ శాఖ ప్రయత్నం చేస్తోంది. ఐటిడిఏ పరిధిలోని గ్రామాల్లో ఇప్పటికే గ్రామగ్రామాన ప్రజలను చైతన్య పరుస్తూ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తుంటగా, మరో ప్రక్క పోలీస్ శాఖ మారుమూల గొత్తికోయ గ్రామాల్లో గిరిజనులు కీటకజనిత వ్యాధుల భారిన పడకుండా దోమ తెరలను పంపిణీ చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పాఠశాలలతో పాటు ఆస్పత్రుల ప్రాంగణాల్లో అవగాహన

మిగతా 2లో..

# పండుగలా ప్లాంటేషన్



**-మొక్కలు నాటడంలో ఖమ్మంజిల్లా టాప్**
**-సమీక్షలో అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రంలో వర్షాలు మొదలవ్వడంతో ప్లాంటేషన్‌ను ఒక పండుగలా చేపడుతున్నట్లు రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌తో కలిసి వన మహోత్సవం పై అధికారులతో అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు నాటడంలో ప్రతిసారి ఖమ్మంజిల్లానే టాప్‌గా నిలుస్తుందన్నారు. జిల్లా లక్ష్యం 31.06 లక్షల మొక్కలు నాటడమని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గతంలో నాటిన మొక్కల సంరక్షణ చేయాలని, చనిపోయిన మొక్కల స్థానే కొత్త మొక్కలను నాటాలని ఆమె తెలిపారు. గతంలో ఏ ప్రాంతంలో ఏ మొక్కలు బాగా పెరిగింది, ఏ ప్రాంతంలో ఏ మొక్కలు నాటాలి, ఏఏ మొక్కలు నాటాలి, ఏ మొక్కలు మనుగడ పొందుతాయో చూడాలన్నారు. సమయానుకూలంగా మొక్కలు నాటితే మనుగడకు ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, యువత, పిల్లలు, అన్ని వర్గాల

మిగతా 2లో..

## 20 స్థానాలు పెరిగితే
# దేశ రాజకీయ ముఖచిత్రం మారేది

(మొదటిపేజీ తరువాయి)
సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో రఘురాంరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వడం లేదని అధికార పక్షానికి సమయ పరిమితే లేదన్నారు. స్పీకర్ , రాష్ట్రపతి కూడా బిజెపి నేతల్లాగానే వ్యవహరిస్తున్నారని రాష్ట్రపతి ఉపన్యాసం బిజెపి నేతల ఉపన్యాసాన్ని తలపించిందని ఆయన తెలిపారు. 40 ఏళ్ల నాటి ఎమర్జెన్సీని ఎత్తి చూపడం ద్వారా బిజెపి ఏమి సాధించాలనుకుంటుందో అర్థం కావడం లేదన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించడంలో బిజెపి విఫలమైందని అందుకే పార్లమెంటులో రాజ్యాంగాన్ని రక్షించండి అంటూ రాజ్యాంగ పుస్తకాన్ని ఎత్తి చూపి నినదించానని రఘురాంరెడ్డి తెలిపారు. మోడీ విధానాల పట్ల బిజెపి మిత్రపక్షాల్లోను అంత సానుకూలత లేదన్నారు. అగ్నివీర్‌తో భారత సైన్యం బలహీనపడుతుందని ఈ విషయాన్ని సైనిక బలగాల ఉన్నతాధికారులు చెప్పినా మోడీ వినే స్థితిలో లేరన్నారు. పార్లమెంటు భవనం కార్పొరేట్ ఆఫీసును తలపిస్తుందని గతంలో ఉన్న భవనం హుందాగా ఉందన్నారు. సిపిఐ సహకారం మరువలేనిదని అన్ని వేళల సిపిఐని కలుపుకు పోతూ అభివృద్ధిలో భాగస్వాములను చేస్తానని రఘురాంరెడ్డి హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లా అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించానని ఇప్పటికే విమానాశ్రయం గురించి మాట్లాడానని బడ్జెట్ సమావేశాల్లో సింగరేణి సమస్యను లేవనెత్తుతానని ఆయన తెలిపారు. పాలేరులో టూరిజం హబ్, ఖమ్మంలో యూనివర్సిటీ స్థాపనకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ రఘురాంరెడ్డి విజయంలో కమ్యూనిస్టు శ్రేణులు తమ వంతు పాత్రను నిర్వర్తించారన్నారు. పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైన తర్వాత కమ్యూనిస్టు పార్టీ ఆఫీసుకు వచ్చి కృతజ్ఞతలు తెలపడం ఒక మంచి పరిణామమని దీనిని సిపిఐ స్వాగతిస్తుందన్నారు. ఎంపి రఘురాంరెడ్డికి అన్ని విధాలా దన్నుగా నిలబడతామని హేమంతరావు తెలిపారు. గత ఎన్నికలు బిజెపికి ఒక గుణపాఠమని మతోన్మాద శక్తులు భవిష్యత్తులో దెబ్బతినక తప్పదని హేమంతరావు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మహ్మద్ మౌలానా, దండి సురేష్ ప్రసంగించగా జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, సిద్దినేని కర్ణకుమార్, కాంగ్రెస్ నాయకులు చంద్రశేఖర్ పాల్గొన్నారు. అనంతరం ఎంపి రఘురాంరెడ్డిని ఘనంగా సన్మానించారు.




# ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు..!







(మొదటిపేజీ తరువాయి)
కల్పిస్తున్నారు.

**48 కేసులు నమోదు...**

జిల్లాలో వర్షాకాలం ప్రారంభమైన నాటి నుండి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దోమలు పెరిగిపోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రత లేకపోవడంతో వ్యాధులకు కారణమవుతోంది. మరో ప్రక్క నీరు కూడా కలుషితం కావడంతో డెంగీ, మలేరియా, టైఫాయిండ్ తో పాటు డయోరియా నమోదు అవుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు అధికారికంగా 16 డెంగ్యూ, 32 మలేరియా కేసులు నమోదైనట్లు వైద్యఆరోగ్య శాఖ వద్ద లెక్కలున్నాయి. జిల్లాలోని పలు పిహెచ్‌సిల పరిధిలో ఈ కేసులు నమోదు కావడంతో అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ఆస్పత్రులకు సీజనల్ వ్యాధుల మందులు సరఫరా చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో సైతం ఓపి పెరిగింది. జిల్లాకు సంబంధించిన వారే కాకుండా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల నుండి కూడా వైద్యం కోసం రోగులు వస్తున్నారు. సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు జిల్లా వ్యాప్తంగా వైద్య ఆరోగ్య శాఖ సిద్దంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**గ్రామాల్లో పర్యటిస్తున్న పిఓ, పోలీస్‌లు...**

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్యం చేసి అవగాహన కల్పించేందుకు ఐటిడిఏ పిఓ బి.రాహుల్ శనివారం చర్ల మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సత్యనారాయణపురం గ్రామంలో పరిసరాలను పరిశీలించారు. ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, విష జ్వరాలు ప్రబలుతున్నందున గ్రామపంచాయితీల ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. టైర్లు, పూలకుండీలు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు లేకుండా చూడాలని, వాటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా పోలీసులు మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ గిరిజనులు దోమల భారిన పడకుండా దోమతెరలను పంపిణీ చేస్తున్నారు. జ్వరాలు వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, రోగాల భారిన పడకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు వివరిస్తున్నారు.

**సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు సిద్ధం :**
**డా. స్పందన, జిల్లా మలేరియా అధికారి**



సీజనల్ వ్యాధులను ఎదుర్కొనేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిద్దంగా ఉంది. ఇప్పటికే ప్రజలు డెంగూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాల భారిన పడకుండా జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరికైన జ్వరం సోకితే వెంటనే ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో దోమలు వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

## గంజాయితో
# చిత్తవుతున్న భవిష్యత్తు..!

(మొదటిపేజీ తరువాయి)
పోలోజు శరత్ చంద్ర స్పందన డిగ్రీ కళాశాలలో బికాం కంప్యూటర్స్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అలేటి శివ వికాస్ కళాశాల హైదరాబాద్‌లో బికాం మొదటి సంవత్సరం చదువుతుండగా గౌంగిడి నిషాంత్ అనే 19 సంవత్సరాల వయస్సు కలిగిన ఈ యువకుడు శ్రీఫైనార్ట్ కళాశాలలో బిఎఫ్ఏ చదువుతున్నాడు. కోటా కృపాకర్ అనే 19 ఏళ్ల యువకుడు బిబిఏ మొదటి సంవత్సరాన్ని యువ డిగ్రీ కళాశాలలో చదువుతున్నాడు. వీరంతా వ్యక్తిగత అవసరాల కోసం గంజాయి రవాణా చేస్తూ పట్టబడ్డారు. ఉన్నత చదువులు చదువుకుని ఎంతో భవిష్యత్తు ఉన్న ఈ విద్యార్థులు ఇలా బలైపోవడం ఆ కుటుంబాలకు చాలా ఇబ్బంది తెచ్చిపెడుతుంది. గంజాయి వ్యాపారులు కళాశాలల చుట్టూ తిరుగుతూ ఎవరికి డబ్బు అవసరం ఉందో గుర్తించి డబ్బు ఎరగా వేసి రవాణాకు ఒప్పిస్తున్నారు. పైన పేర్కొన్న ఐదుగురు కూడా మోటార్ సైకిళ్లపై ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారే. తక్కువ శ్రమతో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చునన్న ఆశతో ఇటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంది. గంజాయి లేదా ఇతర చట్టబద్ధం కాని వ్యాపారాలు చేసే వారి వలలో తమ పిల్లలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# పండుగలా ప్లాంటేషన్

(మొదటిపేజీ తరువాయి)
వారిని వన మహోత్సవంలో భాగస్వామ్యం చేయాలన్నారు. మొక్కల ప్రాధాన్యత కై గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లా రోడ్ మ్యాపును అనుసరించి ప్లాటింగ్ కాని ప్రాంతాలలో ప్లాంటేషన్ చేయాలన్నారు. సింగరేణి స్థలాల్లో పచ్చదనం పెరిగేలా ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో మునగ, నిమ్మ, కరివేపాకు మొక్కలు ఖచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. డిమాండ్ మేరకు మొక్కలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రాధాన్యత కార్యక్రమంగా వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లాకు 31.06 లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉన్నట్లు ఇట్టి లక్ష్యాన్ని వివిధ శాఖల ద్వారా పూర్తి చేయుటకు చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. అటవీ శాఖ ద్వారా 7.60 లక్షలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ చే 10 లక్షలు, నీటి పారుదల శాఖ ద్వారా 1.06 లక్షలు, వ్యవసాయ శాఖ ద్వారా 2.70 లక్షలు, ఉద్యావన, పట్టుపరిశ్రమల శాఖ ద్వారా 1.80 లక్షలు, ఎక్సైజ్ శాఖ 60వేలు, మున్సిపాలిటీల ద్వారా 4.78 లక్షలు, విద్యాశాఖ ద్వారా 30వేలు, పరిశ్రమల శాఖ ద్వారా 30వేలు, గనుల శాఖ ద్వారా 60వేలు, విద్యుత్, సింగరేణి ద్వారా 1.32 లక్షల మొక్కలు నాటుటకు ప్రణాళికలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్థలాల ఎంపిక జాగ్రత్తగా చేయాలని, నాటడమే కాక వాటి నిర్వహణ సంరక్షణకు అనువుగా ఉండేటట్లు చూడాలన్నారు. వచ్చే మూడేళ్లకు నిర్వహణ చర్యలపై ఇప్పుడే కార్యచరణ చేయాలన్నారు. ప్రతి స్థలానికి ఒక బాధ్యత గల వ్యక్తిని కేటాయించి అతని ద్వారా మొక్కల పరిస్థితి పై పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికారులు మొక్కలకు నీటిని అందించడం, సంరక్షణకై పర్యవేక్షణ చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్ పై దృషి పెట్టాలన్నారు. విద్యుత్ తీగల కింద మొక్కలు నాటడం లాంటివి చేయకూడదన్నారు. రవాణాకు ఖర్చు ఎక్కువ కాకుండా మొక్కలు నాటుటకు గుర్తించిన స్థలానికి దగ్గరలేనే నర్సరీలను మొక్కల పంపిణీకి ట్యాగ్ చేయాలన్నారు. మీడియన్స్, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, లేఅవుట్లు, కెనాల్స్, రైతు వేదికలు తదతర ప్రదేశాలపై దృష్టి పెట్టాలన్నారు. వచ్చే గురువారం నాటికి లక్ష్యం పూర్తికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2015 నుండి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి గతేడాది వరకు 14.87 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌కు ట్రీగార్డులను ఏర్పాటు చేయాలన్నారు. సైట్, లోకేషన్, నర్సీల వారీగా కార్యక్రమ పూర్తికి టయప్ చేసినట్లు ఆయన తెలిపారు. విఐపి ప్లాంటేషన్‌కు ప్లాన్ చేస్తే అటవీ శాఖాధికారులను పంపి మొక్కలు నాటుటకు సహాయ సహకరాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, డిఆర్‌డివో సన్యాసయ్య, జెడ్పిసిఈవో ఎస్. వినోద్, డిపివో హరికిషన్, జిల్లా విద్యాధికారి సోమశేఖర శర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా పరిశ్రమల అధికారి అజయ్‌కుమార్, అటవీ అభివృద్ధి అధికారి మంజుల, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి



ప్రజాపక్షం / ఖమ్మం అర్బన్ : సంఘ సంస్కర్త, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతిని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం బాబూ జగ్జీవన్ రామ్ వర్థంతి సందర్బంగా ఆయన చిత్ర పటానికి ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమానికి జగ్జీవన్ రామ్ చేసిన కృషి మరువ లేనిదన్నారు. దళిత హక్కుల కోసం బలమైన వాదన వినిపించిన మానవతా వాది విశిష్ట పార్లమెంటేరియన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు వడ్డెబోయిన నర్సింహారావు, నాయకులు యడ్లపల్లి సంతోష్, సీతారాములు, దొబ్బల సౌజన్య, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి

**-రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక**
**-మహిళా డిగ్రీ కళాశాలలో 75వ వన మహోత్సవం**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేయాలని రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్ తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని మహిళా డిగ్రీ కళాశాలలో 75వ వన మహోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారిణి ప్రియాంక వర్గీస్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు మానవాళి మనుగడకు ఎంతో ముఖ్యమన్నారు. పచ్చని ఖమ్మంజిల్లా పచ్చని తెలంగాణకు మనం ప్రతిన బూనాలన్నారు. వన మహోత్సవంలో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ ఖమ్మంజిల్లాలో వన మహోత్సవంలో భాగంగా 31.06 లక్షల మొక్కలు నాటేందుకు ప్రభుత్వం లక్ష్యం ఇచ్చిందన్నారు. ఇట్టి లక్ష్యాన్ని వివిధ శాఖల ద్వారా సాధించుటకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా అటవీ బీట్ అధికారి వి. సాంబయ్య అడవుల్లో పెరిగే చెట్ల విత్తనాలను ప్రదర్శించి అటవీ ఉత్పత్తులు వాటి ప్రయోజనాల పై అధ్యాపకులు, విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశ్రీ వనజీవి రామయ్య దంపతులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. పద్మావతి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ సంపత్, కళాశాల అధ్యాపకులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, బీట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ




**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి కీర్తిశేషులు ఏనుగు రాఘవయ్య 33వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి వైరా వారి ద్వారా బేబీచైర్స్, టేబుల్ , ర్యాక్, వాటర్‌క్యాన్ మొదలైన సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరు ఎంపివో ఏనుగు సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ సంస్థ వారు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఈ సంస్థ వారు తమ అంగన్‌వాడీ కేంద్రానికి సామాగ్రి వితరణ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. బిజెపి ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు సుమన్‌బాబు మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా ఈ జిల్లాలోనే కాకుండా నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని, ఇకపై కూడా కార్యక్రమాలు అవసరంలో ఉన్న వారికి సాయం చేయడం జరుగుతుందని అన్నారు. సంస్థ అధ్యక్షులు మాలతిదాస్ మాట్లాడుతూ సంస్థ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఏనుగు శివరాఘవ, సంస్థ ప్రతినిధులు దాస్, సుభాని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ రఘు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో విద్యుత్ సరఫరాపై, మిషన్ భగీరథ లో కల్తీ నీరు సరఫరా, పడకేసిన పారిశుధ్యం పై, ప్రత్యేకంగా పలు శాఖ అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పారిశుద్ధ్యాన్ని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయాలని వైద్యులు నవ్య కాంత్ తబస్సుం ప్రజలను కోరారు. ఐకెపిలో రుణ బీమా ప్రమాద బీమా సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని ఐకెపి వెంకట రామారావు తెలిపారు. ఎం పి ఓ సురేష్ బాబు మాట్లాడుతూ గ్రామాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని గ్రామ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్వహించాలని కార్యదర్శులను కోరారు. మిషన్ భగీరథ లో కల్తీ అవుతున్న నీటిని కాపాడేది ఎవరు? పర్యవేక్షణలో సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్న మిషన్ భగీరథ అధికారులపై చర్య తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులైన రమేష్, నితిన్ లను నిలదీశారు. ప్రజా ప్రతినిధులు కొండూరు కిరణ్, కోఆప్షన్ కమిటీ ఇస్మాయిల్ ప్రశ్నించారు. అంగన్‌వాడీలో రిటైర్మెంట్ ప్రభుత్వం మంజూరు చేసిందని పూర్వ విద్య పై అవగాహన కార్యక్రమాలు అంగన్‌వాడి సిడి పిఓ బేగం జరిగాయని పేర్కొన్నారు. మండలంలో తరచూ విద్యుత్ సరఫరాలో అధికారులను నిలదీశారు. ఇన్సులేటర్లు మరమ్మత్తులు, చెట్లు పడిపోవడం, చెట్లు కొమ్మలు తీగలపై పడిపోవటం వలన విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్లు సమాధానమిచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జడ్పిటిసిలు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పాటు ప్రజా ప్రతినిధులకు నిధులు లేవు, గౌరవ వేతనాలు లేకపోవడం తదితర సమస్యలతో సతమతం అయ్యామని పేర్కొన్నారు. పేరుకే ప్రజాప్రతినిధులమని గత ప్రభుత్వంలో అప్పులు పాలై ఇప్పటికి కూడా నిధులు లేనందున ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం తీర్మానంలో కార్యాలయం ముందు ఈనెల చివరి కల్లా మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటుకు మరియు జీరో బిల్లులు విద్యుత్ శాఖకు అప్పగించాలని తీర్మానం చేశారు. అనంతరం అధికారులు విలేకరులు ఆధ్వర్యంలో 1200 వన మహోత్సవ మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, అధికారులు తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు, కోఆప్షన్ సభ్యులు ఇస్మాయిల్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని తహశీల్దార్ కృష్ణప్రసాద్ అన్నారు. శనివారం తహశీల్దార్, ఎంపిడిఓ, ఐసిడిఎస్ కార్యాలయాల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచటం వలన భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయన్నారు. పూర్వం అడవులు దట్టంగా ఉండటంతో కాలమాన ప్రకారం వాతావరణం మార్పులు అనుకూలించి విస్తారంగా వర్షాలు పడేవన్నారు. మానవ మనుగడకు, శతకోటి జీవరాసులు అభివృద్ధి చెందాలంటే ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ సిడిపిఓ రోజారాణి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబీస్ టీకాలు వేయించాలి

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట:** ఇంటి ఆవరణంలో పెంచుకునే జంతువులు ముఖ్యంగా కుక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని పశువైద్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమాన్ని స్థానిక లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పశువైద్య కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబీస్ టీకాలను అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ జంతువులకు వచ్చే వ్యాధులు మనుషులకు సోకే అవకాశం ఉంటుందని, తమ పెంపుడు జంతువుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ బాధ్యులు దుర్గారావు, జూపల్లి బ్రహ్మారావు, యూఎస్ ప్రకాశ్‌రావు, వైద్య సిబ్బంది అశోక్, బాజ్జి, భవాని, సిహెచ్.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన మైనార్టీ నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండల మైనారిటీల సమస్యలపై వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్‌పాషా, సింగరేణి మండల కోఆప్షన్ మెంబర్ ఎండి హనీఫ్ విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, వైరా నియోజకవర్గ యువజన ఉపాధ్యక్షులు దారావత్ వినోద్‌నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాప్(టోని), ఎస్టీ సెల్ నాయకుడు గుగులోతు భీముడు నాయక్, షేక్ జాని తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల మధ్య గౌతమ్ సూర్య జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మారెళ్ళ లక్ష్మణ్‌రావు మనవడు దూదిపాళ్ళ రాధిక, లక్ష్మణ్ దంపతుల కుమారుడు గౌతమ్ సూర్య జన్మదిన వేడుకలను శనివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న 8 అంగన్వాడీ కేంద్రాలకు బీరువాలను మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు మారెళ్ళ లక్ష్మణ్‌రావు చేతుల మీదుగా వితరణగా అందచేశారు. తొలుత గౌతమ్ సూర్య జన్మదిన వేడుకల కేక్ కట్ చేసి చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జన్మదిన వేడుకల సందర్భంగా చిన్నారులకు బీరువాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. అనంతరం హైస్కూల్ , అంగన్వాడీ కేంద్ర ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మారెళ్ళ మల్లికార్జున్‌రావు, వెంకటయ్య, మాజీ ఎంపిటిసి తాళ్ల జోసెఫ్, మారెళ్ళ మోహన్, సెక్రటరీ వేణు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో కాంగ్రెస్ పార్టీ కారాయలయంలో భారత మాజీ ఉపప్రధాని బాబుజగజ్జీవన్‌రామ్ 38వ వర్ధంతి సందర్భంగా వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పమ్మి అశోక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పురపాలక చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దాసరి దానియేలు, పాలేటి నర్సింహారావు, పొదిల హరినాధ్, సిరిపురం ఎంపిటిసి మట్టూరి కృష్ణారావు, దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, బిడికె.రత్నం, మచ్చా బుజ్జి, బోళ్ళ గంగారావు, చప్పిడి వెంకటేశ్వరరావు, ఫణితి శ్రీనివాసరావు, కర్నాటి హనుమంతరావు, కొప్పురావూరి శబరినాధ్, మరికంటి శివ, పెద్దప్రోలు లక్ష్మయ్య, ఏదునూరి శ్రీను(బుజ్జి), గుత్తికొండ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## తాటిపూడిలో తాగునీటి సరఫరా ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో నాలుగు రోజులుగా త్రాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజాపక్షం దినపత్రికలో కథనంలో త్రాగునీటి కోసం తల్లడిల్లుతున్న తాటిపూడి గ్రామం అనే కథనాన్ని ప్రచురించడం జరిగింది. ఈ కథనానికి స్పందించిన అధికారులు వెంటనే పైప్‌లైన్ లీకేజీ మరమ్మత్తులు చేపట్టి గ్రామంలో త్రాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో నాలుగు రోజులు ఇబ్బందులు పడ్డ ప్రజలు త్రాగు నీరు అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## ఎంపి రఘురాంరెడ్డిని కలిసిన మున్సిపల్ చైర్మన్



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డిని ఖమ్మం ఆయన కార్యాలయంలో వైరా మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రేస్ నాయకులు పాల్గొన్నారు.

## గాలి వాన వస్తే గాఢాంధకారమే..



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో గాలివాన వస్తే గాఢాంధకారంతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో తరచూ వస్తున్నా గాలి, దుమారం వర్షాలకు గాను చిన్నపాటి గాలికి దుమారం వస్తే విద్యుత్ సరఫరాలో అంతరాయం కావడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజుల నుంచి కల్లూరు ,పెద్ద కోరుకొండి, బత్తులపల్లి, విద్యుత్ ఉపకేంద్రముల పరిధిలో విద్యుత్ సరఫరా లో తరచూ అంతరాయం వలన ఉక్కపోతలు, దోమలు, చిన్నపిల్లలతో బాధలు, ఇబ్బందులు వర్ణనాతీతం. ఈ అంతరాయాన్ని నివారణకు మార్గాలను వినియోగదారులు అధికారులను కనిపెట్టాలని కోరుతున్నారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, లింగాల , ముచ్చారం, కల్లూరు ,బత్తులపల్లి, పేరు వంచ తదితర గ్రామాలలో వినియోగదారులు సుమారుగా 20000 మంది ఉండగా విద్యుత్ సరఫరా లో అంతరాయం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంతరాయాన్ని నివారించేందుకు నివారణకు ప్రణాళికలను చేపట్టి అంతరాయం లేకుండా చూడాలని అధికారులను కోరుతున్నారు.

## త్రిబుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక చేయూత



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బాసర త్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 10000 నగదు ఆర్థిక చేయూత సత్కారం తోపుడు బండి ఫౌండేషన్ సాధిక్ అలీ వారి ఆధ్వర్యంలో అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి షేక్ సాదియా,షేక్ సుమయ్య, బిల్లుపాడు ఉన్నత పాఠశాల నుండి కొల్లిపాక కోటేశ్వరి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి కంచు భవిష్, ఈ నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 10000 చొప్పున ఆరు సంవత్సరాలు అయ్యే పాటు ఖర్చును తోపుడు బండి ఫౌండేషన్ వారు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, బాలికల ఉన్నత పాఠశాల పొదిలి పద్మ ,బిల్లుపాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోజప్ప, కల్లూరు మండలం నోడల్ఆఫీసర్ పత్తిపాటి నివేదితతోపాటు విద్యార్థిని విద్యార్థులు పిల్లల తల్లిదండ్రులు ఆనందోత్సవాల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. ప్రోగ్రాం కోఆర్డినేటర్ పసుపులేటి వీరరాఘవయ్య, వ్యాయామ దర్శకుడు బి బీమా, ప్రభుత్వం ఉన్నత పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి టీవీ వితరణ



**ప్రజాపక్షం-చింతకాని :** మండలపరిధిలోని కొదుమూరు గ్రామపంచాయతీ కొత్తూరు అంగన్‌వాడీకేంద్రానికి కాంగ్రేస్ సీనియర్ నాయకులు పెంట్యాల అప్పారావు టీవీని బహుకరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ చిన్నారులకు కాలక్షేపంతో పాటు విద్యాబుద్ధులు నేర్పేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ సిబ్బంది అప్పారావు కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పారావు కుమారుడు సురేష్ ,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

### రెబ్బవరం మహాత్మాజ్యోతిరావు పూలే
# పాఠశాలకు రక్షణ గోడ ఎక్కడ..?

-బాత్‌రూమ్‌లు సరిపోక ఇబ్బందిపడుతున్న విద్యార్థినులు
-పట్టించుకునే నాథుడే కరువాయే..







**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం రెబ్బవరం గ్రామంలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో విద్యార్థుల భవనానికి రక్షణ కరువైంది. ఈ పాఠశాల భవనం చుట్టూ పూర్తిస్థాయిలో రక్షణ గోడలు లేకపోవడంతో ప్రక్కనే పొలాలు ఉండడంతో ఎలాంటి విష జంతువులు వస్తాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు రక్షణ గోడ కూడా లేకపోవడంతో కుక్కలు సైతం పాఠశాల ఆవరణలో తిరుగుతున్నాయి. ఈ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు ఉన్నారు. కాని విద్యార్థుల వసతుల విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే విద్యార్థులు పాఠశాలకు రక్షణ గోడ లేదు అంటే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు చదువుకునే పాఠశాలకు గట్టి బందోబస్తు అవసరం. ఈ పాఠశాలకు చుట్టూ రక్షణ గోడలు లేకపోవడం అతి పెద్ద సమస్యగా చెప్పుకోవచ్చును. విద్యార్థులు బట్టలు ఆరవేసుకోవడానికి పోదాం అన్నా సరేనా సౌకర్యాలు లేక ఉన్న స్థలం లోనే ఇబ్బంది పడుతూ ఆరవేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాల ఆవరణలో దట్టమైన కంప మొక్కలు పెరగడంతో అడవులను తలపిస్తున్నాయి. మరోపక్క విద్యార్థులకు అత్యంత ముఖ్యమైన సమస్య ఏమిటంటే బాత్‌రూమ్‌లు సక్రమంగా లేకపోవడం పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఉండపోవడం సుమారు 600పై విద్యార్థినిలకు 10 బాత్‌రూమ్‌లు ఎలా సరిపోతాయి. పాఠశాలలో ఉన్న వాటర్ మినరల్ ప్లాంట్ పనిచేయకపోవడంతో గత కొన్ని రోజుల నుండి బయటను మినరల్ ప్లాంట్స్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి. ఒకపక్క వాష్‌రూమ్ ఉంటే మరో పక్క పాఠశాల వంట గదిలో ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే రెబ్బవరం మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలు వర్ణాతీతం. అధికారులు జోక్యం చేసుకొని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు ఏర్పాటు చేసి పాఠశాలకు రక్షణ గోడ ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

## భద్రయ్య ఆత్మహత్య యత్నానికి కారుకులైన వారిని శిక్షించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి రెవెన్యూ పరిధిలోని రైతు ఆత్మహత్య ప్రయత్నంకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం సింగరేణి మండల కమిటీ డిమాండ్ చేసి ప్రభుత్వ పోలీస్ అధికారులను కోరింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులకు భూక్యా వీరభద్రం, కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేంద్ర, సర్పంచ్ బానోతు బన్సీలాల్ మాట్లాడుతూ ఉసిరికాయలపల్లి రెవిన్యూ ఆలియా తండా సమీపంలో పచ్చిపాల భద్రయ్యకు చెందిన 548 సర్వే నెంబర్ గల భూమిని మాజీ ఆర్‌టిఏ కమీషనర్ శంకర్‌నాయక్ ఆక్రమించుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన రైతు పచ్చిపాల భద్రయ్య గురువారం పొలం వద్ద పురుగు మందు త్రాగి ఆత్మహత్య ప్రయత్నాన్ని చేసుకున్నాడని అన్నారు. అందుకు కారకులైన గుగులోతు శంకర్‌నాయక్, అతని భార్య లక్ష్మి లపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. సమస్య ఉత్పన్నమైన వెంటనే అధికారులు స్పందించి పరిష్కారం చూపించాలన్నారు. వ్యవసాయ సీజన్ తరుణంలో ముందుకు వచ్చే వివాద భూముల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పోలీస్ అధికారులు జోక్యం చేసుకొని పరిష్కరించాలని వారు కోరారు. సమస్యలు ఉత్పన్నమైనప్పుడు ఆధారపడి రైతులు ఆత్మహత్య ప్రయత్నాలు చేసుకోవద్దని, న్యాయబద్ధమైన సమస్యను పరిష్కారం కోసం ప్రయత్నించాలని అందుకు సిపిఎం, రైతు సంఘాలు న్యాయం పక్షాన నిలబడతాయని వారు తెలిపారు. ప్రకటన చేసిన వాళ్ళు మండల నాయకులు వజ్జా రామారావు, దాసరి మల్లయ్య, తలారి దేవ ప్రకాష్, వడ్డే అజయ్‌బాబు, సురబాక ధనమ్మ, లక్ష్మణ్, రవి, కొండల రావు, చందర్, మంగయ్య, సైదులు, శోభన్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## విద్యుత్తు లైట్లు, పారిశుధ్య పనులు చేపట్టాలి

### మున్సిపల్ కమిషనర్‌కు సిపిఐ నాయకుల వినతి




**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీలోని గ్రామాల్లో విద్యుత్ లైట్లు వెంటనే ఏర్పాటు చేయాలని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ నాయకులు శనివారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ఎం.ఉమామహేశ్వరరావు కు వివరించి వారికి అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా మునిసిపాలిటీలో వీధి లైట్లు వెలగక అనేక ఇబ్బందులు పడుతున్నప్పటికీ, మునిసిపల్ అధికారుల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీ అన్నింటికీ వీధిలైట్ల టెండర్ ఒకరికి ఇచ్చారని, మేము వారికి ఎన్నిసార్లు లెటర్స్ రాసిన, చెప్పినా సమాధానం చెప్పడం లేదని అధికారులు అంటున్నారు. మున్సిపల్ అధికారులు ఇలాగే కాలం వెళ్లబోస్తూ వస్తున్నారని , వర్షాకాలం ప్రారంభమై చెరువులు , కాలువలు పొంగి పొర్లుతున్నాయని, గ్రామాల్లో రోడ్ల వెంట, ఇండ్ల వెంట, పాములు తేళ్లు సంచరిస్తున్నాయని, వీధిలైటు లేకపోవడం వలన గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తనీరు చేరడం వలన బావుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, క్లోరినేషన్ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ వి నాయుడు జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి సీతారాములు, ఆధర్ల రాములు, కన్నేబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల్లేక పంచాయతీల్లో పరేషాన్..!

-తలలు పట్టుకుంటున్న పంచాయతీ కార్యదర్శులు.
-ఏడు నెలలు గా వేతనాలు లేని కార్మికులు.
-బదిలీ అయితే పెట్టుబడులు సంగతి ఎందంటున్న వైనం.






**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** పారిశుద్ధ్యం నిర్వహణ కు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లు నేడు పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. పైసల్ లేక...ట్రాక్టర్లు కార్యాలయంలోనే ఉంచుతున్నారు. బయటకు తీస్తే డీజిల్ కు డబ్బులు కావాలి...పెట్టుబడులు పెట్టే వారు లేరు...ఇప్పటికే అందిన కాడికల్లా అప్పులు తెచ్చి పెట్టిన పంచాయతీ కార్యదర్శులు చేతులేత్తెశారు. ఒక పక్క ప్రజలతో ఇబ్బందులు..అధికారుల చివాట్లు తో కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు..కార్మికుల వేతనాలు అందక పని చేయించాలంటే భయంతో కార్యదర్శులు వెనకడుగు వేస్తున్నారు....పంచాయతీల పరిస్థితి దయనీయంగా మారింది.

ఖమ్మం జిల్లాలో 589 గ్రామపంచాయతీలు, భద్రాధి కొత్తగూడెం జిల్లాలో 481 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా చిన్న పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ పల్లెల్లో పారిశుద్ధ్యం ను మెరుగుపరిచేందుకు గత ప్రభుత్వం ప్రతీ పంచాయతీలకు ట్రాక్టర్లు ను మంజూరు చేసింది. నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. ప్రతీ నెలా కొనుగోలు కిస్తీలు, ఇందనం, మరమ్మతులు రహదారి పన్నులు, పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు వీటిన్నంటికి కూడ పంచాయతీలు భరించాల్సి ఉంది. కానీ నేటి పాలకులు పంచాయతీలకు నిధులు మంజూరు చేయటం లేదు.

### ఆదాయాలు లేని పంచాయతీలు.....

ప్రతీ పంచాయతీలకు వసూలయ్యే ఏడాది ఇంటి పన్ను, రెండు, మూడు నెలల కిస్తీలు కూడ సరిపోవటం లేదని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగు నీటి కి మిషన్ భగీరథ రావటంతో నీటి పన్నును పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వం ఇచ్చే పల్లె ప్రగతి నిధులే దిక్కుగా మారాయి. పంచాయతీలకు గరిష్టంగా వచ్చే నిధులు ఏడాదికి రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు ఉంటుంది. వాటిలోనే ట్రాక్టర్ కిస్తీలు, వేతనాలు, పంచాయతీ నిర్వహణ కు ఏ మాత్రం సరిపోవటం లేదు. వచ్చే నిధులు నిర్వహణ కు సరిపోను పరిస్థితులలో ప్రజలు అభివృద్ధి చేయటం లేదని పంచాయతీ కార్యదర్శుల పై అగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోవటంతో పల్లె పాలన గాడి తప్పింది. కార్యదర్శులే సొంత డబ్బులను వెచ్చించి పంచాయతీలను నెట్టుకొట్టుకవస్తున్నారు. ఇలా చిన్న పంచాయతీలకు వచ్చే నిధులకు, ఖర్చులకు పొంతన ఉండటం లేదు. వచ్చే నిధులు ఏ మూలకు సరిపోవటం లేదు. వీటితో పాటు పంచాయతీలలో చిన్నపాటి సమస్యల పరిష్కారానికి సైతం డబ్బులు వెచ్చించాల్సి ఉంటుంది.

### పంచాయతీ కార్మికులు ఏం పాపం చేశారు.....

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే...పంచాయతీలు బాగుండాలి...అవి బాగుండాలంటే....కార్మికులు శుభ్రం చేయాలి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. నిధులు లేక పంచాయతీలను వదిలేశారు. పంచాయతీ కార్మికులకు దాదాపు ఏడు నెలల వరకు వేతనాలు అందకపోవటంతో కార్యదర్శు లు కార్మికులకు పని చెప్పాలంటే భయపడుతున్నారు. దీంతో గ్రామాలలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. పంచాయతీ కార్యదర్శులకు త్వరలోనే బదిలీలు ఉండటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఉంది. ఇప్పటికే కార్యదర్శులు పెట్టిన పెట్టుబడులు ఎలా వస్తాయని ఆందోళన చెందుతున్నారు.

### సమస్యను అధికారులకు తెలియజేశాం. యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి.



పంచాయతీలలో నెలకొన్న సమస్యల పై జిల్లా అధికారులకు తెలియజేశాం. త్వరలోన సమస్య పరిష్కారం అవుతుంది. ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్యం పనులు చేయించాలి. గ్రామాలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. మురుగు, పారిశుద్ధ్యం పట్ల అప్రమతం చేస్తున్నాం.

### ఏడు నెలల నుంచి వేతనాలు రావటం లేదు...బొడ్డు ఆంజనేయులు, పంచాయతీ కార్మికుడు, అనంతనగర్.



ఏడు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుంటే తాము, కుటుంబ సభ్యులు ఎలా బ్రతకాలి. ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా ఉంది. వెంటనే పెండింగ్ వేతనాలు వెంటనే అందించే ఏర్పాట్లు చేయాలి. మా గోడు అర్థం చేసుకుని వేతనాలు ప్రతీ నెలా అందించే ఏర్పాట్లు చేయాలి. పని భారం తగ్గించాలి. అధికారులు ఆ దిశగా చూడాల్సిన అవసరం ఉంది.

### పంచాయతీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కు చిత్తశుద్ధి లేదు....పాగర్తి సుధాకర్, బీసీ సెల్ నాయకులు,



పంచాయతీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి లేదు. కేంద్రం ఇచ్చిన నిధులు తప్ప..రాష్ట్రం ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించటం లేదు. పైసలు విదల్చకుండా అభివృద్ధి అని చెప్పుకోవటం రాష్ట్ర ప్రభుత్వం కు తగదు. వెంటనే ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వెంటనే నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

# ట్రాఫిక్ వలయంలో మధిర



**ప్రజాపక్షం/ మధిర :** నియోజకవర్గ కేంద్రమైన మధిర పట్టణం ట్రాఫిక్ వలయంలో చిక్కుకుపోవడంతో వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకి మధిర పట్టణంలో జనాభా పెరుగుతుండగా దానికి తగిన విధంగా మౌలిక వసతుల ఏర్పాటు కావటంలో ఇంకా వెనుకంజలోనే ఉంది. అనేక సంవత్సరాలుగా మధిర పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్, వినాయకుడి సెంటర్, రాయపట్నం సెంటర్‌లలో రహదారులు ఇరుకుగా ఉండటంతో వాహనాలు వెళ్లాంటే ఎన్నో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. రహదారి ఇరుకుగా ఉండటంతో పాటు రహదారికి ఇరుపక్కల దుకాణాల వద్దకు వివిధ రకాల సరుకులు కొనేందుకు ద్విచక్ర వాహనాలు, కారులపై వస్తున్నారు. వాహనాలు నిలుపుదల చేసేందుకు స్థలం లేకపోవడంతో షాపుల్లో పని అయ్యేంత వరకు రాహదారిపైనే వాహనాలు నిలపాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వెళ్లేందుకు సరిపడా రహదారి లేకపోవడంతో ప్రజలు రాకపోకలు కొనసాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కొక్కసారి వాహనాదారులకు, ప్రజలకు ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. అయితే ఈ రహదారిని అంబేద్కర్ సెంటర్ నుండి శివాలయం మీదుగా వైరా నదిపై బ్రిడ్జి నిర్మించి మడుపల్లి వరకు వెడల్పు చేసేందుకు డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ఇటీవల నిధులు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తయితే మధిర పట్టణంలో కొంతమేర ట్రాఫిక్ సమస్య తొలగనున్నది. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలు తిరుపతమ్మ తల్లి దేవాలయానికి వెళ్లేందుకు, మున్సిపాల్టీ పరిధిలోని మడుపల్లి ప్రజలకు ఈ రహదారి ఎంతగానో ఉపయోగపడుతుంది. అదేవిధంగా మధిర పట్టణంలో ప్రధాన రోడ్ల విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రోడ్ల విస్తరణ పనులకు పట్టణ ప్రజలు సహకరించాలని, తద్వారా పట్టణాభివృద్ధితో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుందని పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ వర్థంతి సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర సమరయోధునిగా, మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, జిల్లా నాయకులు రంగా హన్మంతరావు, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, కౌన్సిలర్లు కోన ధనికుమార్, మునుగోటి వెంకటేశ్వరరావు, దుంపా వెంకటేశ్వరరెడ్డి, షేక్.జహంగీర్, కర్నాటి రామారావు, ముప్వ వెంకయ్యబాబు, ఆదిమూలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయాలని నిరాహార దీక్షలు




**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణలోని ప్రతిష్టాత్మకమైన సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన బొగ్గు బ్లాక్ ల వేలాన్ని రద్దు చేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసి ఆధ్వర్యంలో జూలై 6 నుండి12 వరకు రిలే నిరాహార దీక్షలకు పిలుపు నిచ్చింది. కార్యక్రమంలో భాగంగా శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మణుగూరు జివిం ఆఫీస్ ముందు దీక్షాశిబిరాన్ని బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ వై రాంగోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న నాయకులకు, కార్మికులకు కండువా కప్పి, దండలు వేసి దీక్షా శిబిరంలో కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే సింగరేణికి చెందిన బొగ్గు బ్లాక్ ల వేలాన్ని రద్దు చేయాలని, ఎటువంటి ఆంక్షలు లేకుండా సింగరేణికి కేటాయించాలని సింగరేణి కాలరిస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియూసిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎం.వి.రామనసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వర్, జాయింట్ సెక్రటరీ జి. పుల్లారావు, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, నంబూరి శ్రీనివాసరావు, అబ్దుల్ సుభాన్, ఆడెపు రాజశేఖర్, పిట్ సెక్రటరీలు ఆంతోని రవికుమార్, ఆర్ శివ, ఎండి ఇమాముద్దీన్, దండు విజయ్, జల్లారపు రమేష్, ఆర్ శ్రీనివాస్, నాగుల సతీష్, వి.ఏడుకొండలు, జి రామకృష్ణ తో పాటు కార్మికులు ఈ దీక్షా శిబిరంలో పాల్గొన్నారు.

## మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ మధిర :** భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా మనస్థాపానికి గురై భర్త ఆత్యహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని రాయపట్నంలో జరిగింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయపట్నం గ్రామంలో భార్యభర్తల మధ్య జరిగిన చిన్న వివాదం కారణంగా మనస్థాపానికి గురైన భర్త కోట లక్ష్మణ్‌రావు(45) గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గదిలోకి వెళ్లిన భర్త ఎంతసేపటికి రాకపోవడంతో అనుమానం వచ్చి గది తలుపు తెరిచి చూడగా అప్పటికే భర్త ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించి స్థానికుల సహాయంతో కిందకి దింపి హుటాహుటిన మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మార్గం మధ్యలో లక్ష్మణ్‌రావు తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధాంచారు. మృతునికి పిల్లలు ఉన్నారు.

# ప్రైవేటీకరణను అడ్డుకుంటేనే సింగరేణి సంస్థకు మనుగడ



**-దేశ సంపదను కార్పోరేట్లకు దోచిపెడితే చూస్తూ ఊరుకోం**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా**
**-బొగ్గు గనుల వేలంను నిరసిస్తూ**
**సింగరేణి హెడ్డాఫీస్ ఎదుట రిలే దీక్షలు ప్రారంభం**

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను అడ్డుకుంటేనే సింగరేణి సంస్థ మనుగడ ఉంటుందని, కోల్ బెల్ట్ ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ అన్నారు. తెలంగాణలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాకుతోపాటు ఇతర బొగ్గుబ్లాకులను వేలం వేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు జరపతలపెట్టిన రిలే నిరాహారదీక్ష శిభిరాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం దేశ సంపదను కుబేరులకు కట్టబెట్టి మరింత కుబేరులను చేసే చర్యలకు పాల్పడుతోందని, ఇది పరోక్షంగా ఆర్థిక నేరానికి పాల్పడటమేనన్నారు. ప్రజలకు చెందాల్సిన బొగ్గు నిక్షేపాలు బడాబాబులకు కట్టబేడతామంటే చూస్తూ ఊరుకోబోమని, ప్రజా ఉద్యమాలతో మోడీకి కంటిమీద కునుకులేకుండా చేస్తామని హెచ్చరించారు. బొగ్గు వెలికితీతలో సుధీర్ఘ అనుభవం ఉన్న సింగరేణి సంస్థను కాదని లాభాల కోసం పనిచేసే ప్రభుత్వేతర ప్రైవేటు సంస్థలకు బొగ్గుబ్లాకులను అప్పగించడం పరోక్షంగా సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే చర్యల్లో భాగమేనని, తెలంగాణ ప్రజలు, తెలంగాణ పరిశ్రమలంటే కేంద్రానికి నిర్లక్ష్యమెందుకో సమాధానం చెప్పాలన్నారు. సింగరేణి సంస్థను పరిరక్షించుకునే భాధ్యత తెలంగాణ సమాజంపై ఉందని, అందుకోసం విపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు చేపట్టబోయే ఆందోలన, పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. బొగ్గుగనుల వేలం పాటను నిరసిస్తూ చేపట్టిన వారం రోజుల నిరసన దీక్షలు విజయవంతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి, వి.మల్లికార్జున్‌రావు, ఎస్.వి.రమణమూర్తి, జె.గట్టయ్య, రాము, కిష్టాపర్, సందెబోయిన శ్రీనివాస్, ఎస్.నాగేశ్వర్‌రావు, చంద్రయ్య, బండారు మల్లయ్య, నాగయ్య, భూక్య దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, గోపి కృష్ణ, టి.లక్ష్మి నారాయణ, నూనావత్ గోవిందు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ఎమ్మెల్యే పాయం





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామ పంచాయితీలోని ప్రభుత్వ కళాశాలలో 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన పలు మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటే ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకొని రాబోయే తరానికి మంచి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు రైతాంగానికి వర్షాలు అధికంగా పడే విధంగా దోహదపడతాయన్నారు. కళాశాలలో నాటే ప్రతి మొక్కను కళాశాల యాజమాన్యం ప్రతి రోజు నీళ్లు పోసి సంరక్షించాలని బాధ్యత ఉందన్నారు. అదే విధంగా వివిధ కంపెనీలలో మొక్కలు ఎక్కువ శాతం పెంచే విధంగా చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మొక్కలు పెంచే కార్యక్రమం చేపట్టిందన్నారు. అనంతరం ఎంఎల్‌ఏ పాయంకు పలు సమస్యలపై వినతి పత్రాలు అందించారు. స్వీకరించిన ఎంఎల్‌ఏ సానుకూలంగా స్పందించి అన్నింటిని పరిశీలిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ముజాహీద్ద్, మండల అభివృద్ధి అధికారి జములారెడ్డి, సిడిపివో ప్రమీల, మండల పంచాయితీ అధికారి సునీల్ శర్మ, ఏపీవో విజయలక్ష్మి, పంచాయితీ కార్యదర్శి మూల నాగిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ సొసైటీ ఛైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచులు గోవింద్, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకుల భజన సతీష్, రమేష్, బిజ్జం వెంకటేష్‌రెడ్డి, లింగయ్య, రోశిరెడ్డి, దాసరి సాంబ, మండల నాయకులు, మహిళా నాయకులు, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/బూర్గంపాడు :** గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ద్వారా జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం తప్పని సరిగా రాత్రిపూట సబ్జెక్టు టీచర్లు విద్యార్థినిలకు అందుబాటులో ఉండి, స్టడీ అవర్స్‌లో విద్యార్థినిలకు సబ్జెక్టులలో వచ్చే సందేహాలు నివృత్తి చేయాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం రాత్రి బూర్గంపాడు మండల కేంద్రంలోని ఏజీహెచ్ఎస్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో తరగతి గదులు, వంట గదలు, డార్మెటరీ పరిసరాలను పరిశీలించారు. పిల్లల చేత సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను ఆయన పరిశీలించి అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థినిల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తాజా కూరగాయలతో మెనూ ప్రకారం ప్రతి రోజు తప్పని సరిగా భోజనం అందించాలన్నారు. రాత్రి పూట పిల్లలను బయటకు పంపకూడదని, పాఠశాల ఆవరణ, డ్రైనేజీలలో నీరు ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థినిలకు ఎటువంటి ఇబ్బందులు కలగుకుండా సంబంధిత హెచ్ఎం , వార్డెన్ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థినికి సికిల్ సెల్ అనిమియ నిర్ధారణ పరీక్షలు చేయించాలని హెచ్ఎంకు ఆదేశించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు భూక్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన అడిషనల్ డిఎస్పీ



**ప్రజాపక్షం/ మధిర :** మధిర రూరల్ పోలీస్‌స్టేషన్‌ను అడిషనల్ డిఎస్పీ ప్రసాద్‌రావు జనరల్ తనిఖీల్లో భాగంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. శాంతిభద్రతల దృష్ట్యా పూర్తిస్థాయిలో పోలీస్‌శాఖ పనిచేయాలని, సమాజంలో పోలీసుల పాత్ర చాలా ముఖ్యమైందని తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో పలు వివరాలను ఎస్సై భార్గవిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట రూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్ళు, సిబ్బంది పాల్గొన్నారు.

# పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:**వర్షాకాల దృష్ట్యా పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు మండల అధికారులను ఆదేశించారు. మండల పర్యటనలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి జములారెడ్డి, మండల పంచాయితీ అధికారి సునీల్ శర్మలతో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని పంచాయితీల పరిధిలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ప్రతి పంచాయితీలలో డ్రైనేజీ పూడికలు తీయించాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆదేశించారు.

# అధిక రేట్లకు విత్తనాలు అమ్మకుండా చర్యలు తీసుకోండి




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** బ్లాక్ మార్కెట్‌లో విత్తనాలు అమ్మకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపిపి బానోత్ పార్వతి వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఎంపిడివో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని అంటూ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, పంచాయితీ కార్మికులు గ్రామాలలో పర్యటించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ షాపులు సమయపాలన పాటించటం లేదని, దీంతో రేషన్ సరుకులు లబ్దిదారులకు అందటం లేదన్నారు. గ్రామాలలో బెల్ట్ షాపులు అధికంగా ఉండటంతో యువత పక్కదారి పడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో అశోక్, వైస్‌ఎంపిపి నరుకుళ్ల సత్యనారాయణ, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎస్‌డి రసూల్, ఎంపిటిసిలు ధారా బాబు, లంక విజయలక్ష్మి, ఎంఈవో సత్యనారాయణ, ఏపిఎం సంతోష్, సిడిపివో నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఉచితంగా జామాయిల్ మొక్కల పంపిణీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అటవీ వ్యవసాయ శాస్త్ర విభాగానికి చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏవి రామాంజనేయులు సహకారంతో మండలంలోని మొగరాళ్ళ గుప్ప గ్రామంలోని రైతులకు అగ్రో మోడల్ ప్లాంటేషన్ కొరకు జామాయిల్ మొక్కలను గిరిజన ఉప పథకం క్రింద సోసైటీ ఫర్ సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో రైతులకు ఉచితంగా జామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. జామాయిల్ జంట సాళ్ళ పద్ధతిలో వేసి అంతర్ పంటలుగా మొక్క జొన్న, పెసర, మినుము, బొబ్బర, వేరుశేనిగ మొదలగు పంటలను సాగు చేసి అదనపుఉ ఆదాయం పొందాలని రైతులను కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఎస్‌జీఎస్ సంస్థ సిబ్బంది సుంకర రంగారావు, ఏపీవో సమ్మయ్య, సీవో ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులకు సహకరించొద్దు

**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** ప్రజల అభివృద్దికి నిరోధకాలుగా మారిన మావోయిస్టు పార్టీకి ప్రజలు ఎవరు సహకరించ వద్దని సిఐ అశోక్ కోరారు . జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు శనివారం ములకనాపల్లి గ్రామంలో కమ్యూనిటి కనెక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంరతం సిఐ అశోక్ మాట్లాడుతూ ఈప్రాంతంలో అనుమానంగా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వారు ఉనికి కాపాడుకోవడం కోసం ఈ ప్రాంత అభివృద్ధి నిరోదకాలుగా నిలుస్తున్నారని అన్నారు. నిషేధిత మావోయిస్టులకు ఎటువంటి సహకారం అందించవద్దని చూసించారు. రానున్న సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని తగు చూచనలు అందించారు. ఈకార్యక్రమంలో ఎస్సై గణేష్, ఆర్ ఎస్సై హుస్సేన్ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# పురుగు మందు సేవించి వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం :** మండల పరిధిలోని పెద కమళాపురం గ్రామానికి చెందిన వర్స సాయిబాబు(20) పురుగుల మందు త్రాగి మృతి చెందాడు.పోలీసులు తెలిపిన వివరాల గత రెండు రోజులుగా భార్యతో గొడవపడి శుక్రవారం పొలంలో పురుగు మందు సేవించి అపస్మారక స్థిలో ఉన్న సాయిబాబుని స్థానికుడు వర్స పగడరాజు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన భద్రాచలం ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా వైద్యం పొందుతూ మృతి చెందాడు. మృతుడు బార్య పిర్యాదు మేరకు ఎస్సై గణేష్‌కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎంపి రఘురాంరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డిని సింగరేణి మండల నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అపరిశుభ్రతకు నిలయం ఆ పాఠశాల..!





**-అధికారుల పర్యవేక్షణ కరువు**
**-భయాందోళనలో విద్యార్థులు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఓ వైపు కృషి చేస్తుంటే మరో వైపు అధికారులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యాన్ని మాత్రం వీడడం లేదు. పరిశుభ్రంగా ఉంచాల్సిన పాఠశాల ఆవరణను అపరిశుభ్రతకు నిలయంగా మార్చారు. పాఠశాలలు పునః ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఆ పాఠశాల ఆవరణను, చుట్టు పక్కల పరిసరాలను పరిశీలిస్తే విద్యాశాఖ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. వివరాల్లోకి వెళితే... నూతన కలెక్టరేట్ సమీపంలోని వి. వెంకటాయపాలెం జగ్యాతండాలో గల ప్రాథమిక పాఠశాల అపరిశుభ్రతకు నిలయంగా మారింది. 25 మంది విద్యార్థులు చదువుతున్న ఆ పాఠశాల ఆవరణతో పాటు చుట్టు పక్కల పరిసరాలు చెత్తాచెదారంతో, పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. పాఠశాల పునః ప్రారంభ సమయంలో పరిశుభ్రత చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఆ పాఠశాలలో అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు ఏమి కనిపించడం లేదు. జిల్లా స్థాయి అధికారులు ఉండే ఆ ప్రాంతంలోనే ఇంత నిర్లక్ష్యంగా ఉన్నారంటే మిగిలిన పాఠశాలల పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. పిచ్చిచెట్లు, ముళ్ల కంచెల్లో నుంచి పాము పిల్లలు వస్తున్నాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాల అపరిశుభ్రంగా ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిపోతున్నారే తప్ప పరిశుభ్రతకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పనులు జరుగుతున్నాయంటూ సమాధానం చెబుతున్నారు తప్ప శుభ్రం చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేదుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

# ప్రాంగణ నియామకాల్లో ఎస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం ఎస్‌బిఐటి కళాశాలలో విటిఏస్ ఎంటర్ ప్రైజెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రాంగణ నియమకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల కృష్ణ మాట్లాడుతూ నిర్దిష్ట ప్రణాళికతోనే విజయం సాధించవచ్చునని ఆయన తెలిపారు. విద్యార్థులు ఒక ప్రణాళికాబద్ధమైన లక్ష్యాన్ని కలిగి ఉండాలని తద్వారా విజయం సులభమవుతుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ ధాత్రి మాట్లాడుతూ ఐటి సర్వీసెస్, ఐటి ప్రొవైడర్ కంపెనీ అయినా విటిఏస్ సంస్థ జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ ఉద్యోగానికి జరిగిన ప్రాంగణ నియమాకాల్లో 215 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో 57 మంది మౌఖిక పరీక్షకు అర్హత సాధించారని,గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ రౌండ్ లో నిర్వహించిన ఎంపికలో వారిలో 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన ఈ నియమాకాల్లో చివరి సంవత్సరం పూర్తయ్యే వరకు ఇంటర్న్‌షిప్ పొందుతారని డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగస్తులుగా పరిగణిస్తారని ఆమె తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ విటిఏస్ సంస్థలో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ లో భాగంగా నెలకు రూ. 25వేల స్టయిఫండ్



వస్తుందని ఆయన తెలిపారు. ఇంటర్న్‌షిప్ అనంతరం వార్షిక ఆదాయంగా రూ.8.5 లక్షల నుండి రూ.12 లక్షల వరకు వారికి అందుతుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 430 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో విటిఏస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ జి.రంజిత్‌కుమార్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటీవ్ ఆర్ కీర్తన, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవివి శివప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జె. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు, టిపివో సవిత, కో ఆర్డినేటర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/పినపాక:** బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని కాంగ్రెస్ పినపాక మండల అధ్యక్షులు రామనాథం అన్నారు. సోమవారం ఈ బయ్యారం క్రాస్ రోడ్ లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో, దేశ స్వతంత్రం కోసం పోరాడిన మహా మేధావి అని గుర్తు చేశారు. పార్లమెంటు సభ్యుడుగా, కేంద్ర మంత్రిగా దేశ ప్రజలకు విశేషమైన సేవలు అందించిన గొప్ప రాజకీయవేత్త అని కొనియాడారు. అస్పృశ్యత, అంటరానితనం వ్యతిరేకంగా కుల రహిత సమాజం కోసం బడుగుల పక్షాన పోరాడిన సామాజికవేత్త అని గుర్తు చేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అలాంటి మహనీయుని వర్ధంతిని ప్రభుత్వాలు అధికారికంగా ఘనంగా నివాళులర్పించడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు.

# పారిశుద్ధ్య నిర్మూలనకు గ్రామస్థాయి కమిటీలు

**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** పారిశుద్ధ్య నిర్మూలనకు గ్రామ స్థాయి లో కమిటీలు ఏర్పాటు చేసినట్లు నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో తన చాంబర్ లో శనివారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....గ్రామంలో పారిశుద్ధ్యం పట్ల ప్రజలను అప్రమతం చేసేందుకు కమిటీలు పని చేయాలని సూచించారు. రోజుకో ఒక గ్రామంలో మూడు గ్రామ పంచాయతీలు సిబ్బంది, అధికారులు సంయుక్తంగా కలిసి పారిశుద్ధ్యం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. శానిటేషన్ పనులు చేసేందుకు అందరూ కలిసి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శివ, ఐకెపి ఏపీయం ఆశోక్‌రాణి, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.



# రెజొనెన్స్‌లో వన మహోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ స్కూల్ లో వన మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం వన మహోత్సవ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు మొక్కలు నాటారు. డ్రాయింగ్‌లు గీశారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు మాట్లాడుతూ ప్రతి ఏడాది వన మహోత్సవ కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భావి తరాలు ఆరోగ్యకరమైన జీవితాలను కలిగి ఉండాలంటే అందరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో విద్యలో రాణించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** క్రమశిక్షణతో మెలుగుతూ విద్యలో రాణించాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు అవినేని శేషయ్య, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య విద్యార్థినిలకు సూచించారు. శనివారం వెలుగుమట్ల ప్రాంతంలో గల ఖమ్మం అర్బన్ మండల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభ్యర్థన, పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సూచన మేరకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అవినేని శేషయ్య, వి. విజయ్‌కుమార్ లు సంయుక్తంగా పాఠశాలకు కంప్యూటర్ (డెస్క్‌టాప్) అందించారు. ఈ సందర్భంగా శేషయ్య, పరిశ పుల్లయ్య లు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు. తాము చదువుతున్న పాఠశాలకు మంచి పేరు వచ్చేలా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో అవినేని పుష్పావతి, లింగా, సంధ్యారాణి, ఉపాధ్యాయులు వసంత, రత్నశ్రీ, లావణ్య, సునీతారెడ్డి, రమాదేవి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

# ఏడూళ్ళ బయ్యారం ఎస్సైగా రాజ్ కుమార్



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండలం ఏడూళ్ళ బయ్యారం సబ్ ఇన్స్‌పెక్టర్ గా రాజ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై మాట్లాడుతూ తన పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు. అదే విధంగా చట్ట వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో కరకగూడెం, మణుగూరు, బూర్గంపాడులలో ఎస్సైగా పని చేసిన అనుభవం ఉందని తెలిపారు.

# తల్లీకూతురిని కాటేసిన పాము

**-కూతురి పరిస్థితి విషమం**



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** నేలకొండపల్లి మండలం లోని సుర్దేపల్లి గ్రామంలో మారపొంగు రాధ, కూతురు దీవెన (5) లు శుక్రవారం రాత్రి ఇంట్లోని వరండాలో నేల పై నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో కట్ల పాము తొలుత కూతురు దీవెన ను కాటేసింది. దీంతో ఏడవటంతో తల్లి నిద్ర మేల్కోనటంతో తల్లిని కూడ పాము కాటేసింది. తల్లి, కూతురు లు ఏడవటంతో స్థానికులు గమనించి వచ్చి చూడగా పాము కాటేసిన విషయం ను గుర్తించారు. ఆ పాము ను కొట్టి చంపారు. స్థానికులు వెంటనే నేలకొండపల్లి ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. వారిలో కూతురు పరిస్థితి విషమించటంతో హైదరాబాద్ తరలించారు.

# ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



**ప్రజాపక్షం-నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలల ను బలోపేతం చేయాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖ ధికారి బాలిన చలపతిరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో శనివారం ప్రధానోపాధ్యాయులు సమావేశం ను నిర్వహించారు. తొలుత నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యంఈవో ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..మండలంలో ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరిగే పనులను శర వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థుల హజరు శాతం ను పెంచాలని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఐకెపి ఏపీయం ఆశోక్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

# లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్‌పి రోహిత్ రాజ్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి పరివాహక లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పి రోహిత్‌రాజ్ సూచించారు. శనివారం ఆయన భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్‌లో నూతన నిర్మితమవుతున్న కరట్ట పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సీజన్లో భద్రాచలం వద్ద గోదావరి వరద నీరు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తం చేయాలన్నారు. వరదలు సంభవిస్తే ఇతర శాఖల అధికారులతో సమన్వయంగా ఉంటూ పరిస్థితిని ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్‌పి అనంతరం ఎస్‌పి రోహిత్ రాజ్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేసిన ఆయన పలు కేసుల వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. గంజాయి రవాణా, గుట్కా, మట్కా, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సిబ్బంది బాధ్యతా వ్యవహరించాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి అంకిత్‌కుమార్ సంక్వార్, సిఐ సంజీవరావు, ఎస్‌బి ఎస్సై నాగరాజు, ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్, ఎస్సై విజయలక్ష్మి తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** భారత ఉపప్రధాని బాబూజగ్జీవన్ రావ్ 38వ జయంతిని జిల్లా మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రామవరంలో అంబేద్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. నాయకులు సామర్లసమ్మయ్య మాట్లాడుతూ భారతదేశానికి తొలి ఉప ప్రధానమంత్రిగా దళిత బిడ్డ పనిచేయడం గర్వకారణం అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని, అలాంటి మహానుభావున్ని స్మరించుకోవడం ఎంతో సంతోషానిస్తుందని తెలిపారు.

**దళిత నాయకులకు సన్మానం...**

ఏఐటియూసి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన కంచర్ల జమలయ్య, ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమితులైన బరిగెల భూపేష్‌ను ఘనంగా సన్మానించారు. వారికి తలపాగాలు అమర్చి షాలువాలు కప్పి పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సావిటి స్వామి, గోపాల్, మదినయ్య, కోటేశ్వరరావు, శ్రీనివాస్, దుర్గయ్య, శంకర్, ఎల్లయ్య, రవి, పోచయ్య, చంద్రయ్య, అంజయ్య, గణేష్, కిరణ్, రామకృష్ణ, రామారావు,నాగుల్ మీరా, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్య ఆరోగ్య సిబ్బంది గిరిజనులకు మేలైన వైద్య సేవలు అందించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ అన్నారు. శనివారం చర్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం ఆయన పర్యటించి ఇంటింటికీ తిరిగి పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం పిఓ మాట్లాడుతూ వర్షాకాలంలో ఇళ్ల ముందు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, మురుగునీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. పంచాయితీ సిబ్బంది క్రమం తప్పకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దోమలనివారణకు బ్లీచింగ్ పౌడర్, స్ప్రే చల్లించాలన్నారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే సేవించాలని సూచించారు. అనంతరం కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలుతున్నాయని, కొయ్యూరు పిహెచ్‌సిలో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో డిఎంహెచ్ఓ తో ఫోన్లోసంప్రదించి సిబ్బంతి పనితీరు మార్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరండెంగ్యూ వ్యాధి సోకిన రోగుల ఇంటికి వెళ్లి పరామర్శించి సరైన వైద్య పరీక్షలు చేయించుకునిక్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. ప్రతీ గ్రామంలో దోమల మందు పిచికారీ చేయించాలని ఆదేశించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికీ రక్తపరీక్షలు చేసి రోగనిర్ధారణ చేయాలన్నారు. విధి నిర్వహణలో అశ్రద్ధ వహించిన పంచాయితీ కార్యదర్శి ఉదయ్‌కుమార్ కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని డిపిఓను ఆదేశించారు. అనంతరం కత్తిగూడెం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి పిల్లల చేత అక్షరాలు రాయించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని, అక్షరాలతో పాటు లెక్కలు కూడా నేర్పించాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం పిల్లలకు పెన్నులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చర్ల ఎంపిడిఓ ఈదయ్య, ఎంపిఓ ఎస్‌కె వలి, సిడిపిఓ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# రేపు జరిగే ఏఐకేఎస్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/భద్రాచలం :** సోమవారం జరిగే ఏఐకేఎస్ జిల్లా మహాసభను జయప్రథం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవికుమార్ పిలుపునిచ్చారు. దుమ్ముగూడెం మండల పరిధిలోని గంగోలు గ్రామంలోలో వివిఆర్ ఫంక్షన్ హాల్లో సభ జరుగుతుందని చెప్పారు. ఉ.10 గం.లకు ప్రారంభమయ్యే ఈ మహాసభకు రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, జిల్లాకార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య, తెలంగాణ రైతు సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పి పద్మ, రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, నాయకులు ముత్యాల విశ్వనాథం, ఏపూరి బ్రహ్మం, నరేంద్ర, నరాటి ప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరావు హాజరవుతున్నట్లు తెలిపారు.

# ఈ దారిన నడిచేదెట్లా..!?

**-రోడ్డుపై మట్టి పోశారు.. వదిలేశారు..**
**-వర్షమొస్తే చుక్కలే..**
**-మమ్మల్ని పట్టించుకోండి మహాప్రభో..**





**ప్రజాపక్షం/కరకగూడెం:** మౌలిక సదుపాయాల కల్పనలో వెనకంజే.. అధికారులు దృష్టి సారించాలి... అభివృద్ధికి ఆమడ దూరంలో ఆ వీధి... సమస్యల వలయంలో గాంధీనగర్... బురద రోడ్డుకి చిరునామా ఆ వీధి... అంటువ్యాధుల వ్యాప్తికి నిలయం... కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామపంచాయతీ గాంధీ నగర్ గ్రామంపై ప్రజాపక్షం అందిస్తున్న ప్రత్యేక కథనం...

గాంధీనగర్ గ్రామానికి అంగన్ వాడి బడి గాని, స్కూల్ గాని లేదు. రావాలంటే రెండు కిలోమీటర్లు నడిచి రావాలి. ఎన్నిసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు చెప్పిన పట్టింపు లేదు. ఆ వీధి వాసులంటే అధికారులకు లెక్కలేనట్లు ఉంది. ఇదంతా ఓ లెక్క అయితే... ఇదే కరకగూడెం మండలంలోని తాటి గూడెం గ్రామపంచాయతీ గాంధీ నగర్ లో సరైన రోడ్డు లేదు, స్కూళ్ళు లేవు, ఎలా బతకాలని గ్రామస్తులు, ఆ వీధిలోని స్థానికుల ఇక్కట్ల గురించి ఎంత చెప్పినా తక్కువనే చెప్పాలి. ఈ వీధి రోడ్డు చూడు! రోడ్డు పరిస్థితి చూడు! అనే తరహాలో ఇక్కడి మట్టి రహదారి పరిస్థితి ఉందనే చెప్పాలి. బురద దారిపై నడవాలంటే పగటిపూటి చుక్కలు కనబడతాయని అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదనే చెప్పాలి. స్థానిక పంచాయతీ నిర్లక్ష్యమో లేక మండల పంచాయతి అధికారుల పర్యవేక్షణ లోపమో తెలియదు గాని ఈ రోడ్డు మధ్యలోనే ఆపారు. ఈ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందనే చెప్పాలి. గ్రామంలో గల మట్టి రోడ్డు అంత బురద బురదమయం, తెలియని వారి స్థితి అని స్థానికులు ఈ సందర్భంగా తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ఆరోగ్యానికి అనారోగ్యం పాలు చేసేలా లోపించిన పారిశుధ్యం, దోమల వ్యాప్తికి ఈ వీధిలోని అనువైన పరిస్థితులు, విష సర్పాలు, తేళ్లు, జెర్రీ లు వంటి వాటికి అనుకూలమైన వారి స్థితులు ఇక్కడ ఉన్నాయని చెప్పాలి. క్షేత్రస్థాయిలో ప్రజల ఇబ్బందులు ఇట్లా ఉంటే స్థానిక పంచాయతీ, సంబంధిత మండల స్థాయి అధికారులు ఏమి చేస్తున్నారు అనేది ఇక్కడ ప్రశ్నార్థకమనే చెప్పాలి. పల్లెలు అభివృ ద్ధి చెందాలి.. ప్రజలు అభివృద్ధి పథం లో నిలవాలి.. అనే తెలంగాణప్రభుత్వం లక్ష్యానికి ఇక్కడ తూట్లు పొడుస్తున్నాయని చెప్పడంలో ఎటు వంటి సందేహం లేదని స్థానికులు ఈ సందర్భంగా వాపోతున్నారు. ఆ గ్రామానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్నాయని చెప్పాలి. బురద దారిపై నడిచేదె ట్లా!? ఆరోగ్యాన్ని అనారోగ్యం పాలు చేసే ఇక్కడి పరిస్థితుల్లో ఉండేదెట్లా!? అంటూ తమ బాధను స్థానిక ప్రజలు తెలుపుతూ మమ్మల్ని పట్టించుకోండి మహాప్రభో! అని అధికారులను తమ ఇక్కట్ల నడుమ స్థానిక ప్రజానీకం ఈ సందర్భంగా విన్నవించుకుంటున్నారు. పెద్దన అబెల్లి పంచాయతీలోని ఈ వీధిలో గల సమస్యలను పరిష్కరించేలా అధికారులు తగు చర్యలు తీసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

**మా సమస్యను పరిష్కరించాలి : జిమ్మిడి అఖిల్, 5వ తరగతి..**



మా గ్రామానికి స్కూల్ లేదు, అంగన్‌వాడీ లేదు, స్కూల్ కి వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లాలి, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకోవడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి మా గ్రామానికి స్కూల్ అంగన్‌వాడి ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

**మా గ్రామ రోడ్లు ఎప్పుడు అవుతాయో..? : గోగు సాయి, గ్రామస్తుడు.**



రోడ్లు స్టార్ట్ చేశారు. మధ్యలోనే ఆఫ్ చేశారు మట్టి పోసి, నడవాలంటే నాన్న ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు పిల్లలు పెద్దలు వికలాంగులు ఆ బురదలో నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికైనా ఆ రోడ్డుని త్వరగా అయ్యేలా చూడాలని కోరుకుంటున్నాను. స్థానిక ఎమ్మెల్యే స్పందించి వెంటనే మాకు రోడ్డు పోపించేలా చేయాలని గ్రామస్తులు కోరుతున్నాను.

# రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్‌పై జీవో విడుదల చేయాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఏళ్ల తరబడి అంగన్‌వాడీ టీచర్లుగా ఆయాలుగా గౌరవ వేతనంతో పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి సిహెచ్ సీతామహాలక్ష్మి తెలిపారు. రాష్ట్ర సమితి సభ్యురాలు ఎం. విజయకుమారి తో కలిసి శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సిబ్బందికి పదవీ విరమణ తర్వాత ఆర్థిక, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని కానీ అవి నేటికి అమలు జరగడం లేదని వారు తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సీతక్కను కలిసి అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలికి రెండు లక్షల రూపాయలు, హెల్పర్‌కు లక్ష రూపాయలు చెల్లించాలని కోరడం జరిగిందని ఈ మేరకు మంత్రి హామీ కూడా ఇచ్చారని కాని ఆ హామీని వెంటనే అమలు చేయాలని సీతామహాలక్ష్మి కోరారు. లేని పక్షంలో ఆందోళనను చేపడతామని ఆమె తెలిపారు.

# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** భారతీయ జన సంఘ్ స్థాపకులు, స్వాతంత్ర సమరయోధుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు మరవలేనివి అని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలం లోని కొత్తకొత్తూరు లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం ను నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...దేశ ప్రజల కోసం నిరంతరం సేవలు అందించిన మహానీయులు అన్నారు. ఆయన చూపిన మార్గం ను ప్రతీ ఒక్కరూ అనుసరించాలని సూచించారు. దేశ ప్రజల కోసం ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పిట్టల సూరిబాబు, బాజా రామకృష్ణ, కందరబోయిన గోపి, జడ కోటేశ్వరరావు, మూడు రమేష్, పోనుగోటి నాగయ్య, దేశబోయిన వేణు, కళ్యాణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.